
న్యాయం చేయాలని
నిర్వాసితుల ఆందోళన
● గజ్వేల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన
6

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
శుక్రవారం 22 ఆగస్టు 2025



రాజంపేట నుంచి హాస్టల్ గడ్డ ఈద్గా వరకు రూ. 2కోట్లతో సీసీరోడ్డు

రాజంపేట ఫిల్టర్ బెడ్‌లో సీసీ రోడ్డు, లైటింగ్ ఏర్పాటు

సెప్టెంబర్ 10 వరకు పనులు ప్రారంభించాలని మున్సిపల్ అధికారులకు సూచించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో పలు అభివృద్ధి పనులపై స్థానిక మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. అధికారులను అడిగి సమస్యలు తెలుసుకొని పలు సూచనలు చేశారు. రాజంపేట చౌరస్తా నుంచి ఈద్గా వరకు సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఫిల్టర్ బెడ్‌లో ఎల్లప్పుడూ వెలుతురు ఉండేలా ప్రత్యేకంగా స్తంభాలు, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పనులకు రూ.2 కోట్లు అవసరం ఉంటుందని అధికారులు జగ్గారెడ్డికి వివరించారు. ఈ పనులను మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా చేపట్టేలా చూడాలని ఆయన సూచించారు. ప్రభుత్వం నుంచి వేరే ఫండ్ వచ్చినప్పుడు జనరల్ ఫండ్‌కు సర్దుబాటు చేసేందుకు కలెక్టర్, అదనపు కలెక్టర్ అనుమతి కోరాలని మున్సిపల్, పబ్లిక్‌హెల్త్ విభాగాల అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ రఘు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, నాయకులు కూన సంతోష్ కుమార్, మహేష్, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




సంగారెడ్డిలో మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

● ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి ● నిర్వాహకులకు సీపీ అనురాధ సూచనలు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మరికొన్ని రోజుల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు మొదలుకానున్న నేపథ్యంలో సీపీ అనురాధ మండప నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వినాయక మండప ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ ద్వారా విగ్రహాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముందస్తు అనుమతి తీసుకుంటే భద్రత కల్పించడం సులువు అవుతుందన్నారు. భారీ వినాయకులను తరలించేప్పుడు విద్యుత్ వైర్లు తగలకుండా చూసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలన్నారు. మండపాల వద్ద ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు, వ్యక్తులు కనిపించినట్లుయితే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూం వాట్సాప్ నంబర్ 8712667100, సిద్దిపేట ఏసీపీ 8712667310, గజ్వేల్ ఏసీపీ 8712667330, హుస్నాబాద్ ఏసీపీ 8712667350 నంబర్లకు, లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు.



ఆన్‌లైన్ అప్లికేషన్ ఫాం

నిర్వాహకులతో సమావేశం

సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మండపాల నిర్వాహకులతో పోలీస్ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు నవరాత్రుల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమ నిబంధనలు, ముందస్తు అనుమతి తీసుకునే విధానంపై వివరించారు.

భవిష్యత్ అంతా 'ఏటీసీ'దే

● కలెక్టర్ హైమావతి
● జిల్లాలో పర్యటనలు, సమీక్షలు



ఐటీఐ కళాశాలలో యంత్రాల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్/కుకునూరుపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో ఉన్న అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ)ను కలెక్టర్ హైమావతి సందర్శించి మాట్లాడారు. భవిష్యత్తులో ఏటీసీ కోర్సులకు మంచి అవకాశాలున్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోర్సు పూర్తయిన తర్వాత ఉద్యోగాలతో పాటు స్వయం ఉపాధి కూడా పొందవచ్చని ఆమె తెలిపారు. ప్రిన్సిపల్ వెంకటరమణ కళాశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరగా, పరిశీలించి మంజూరు చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం రామచంద్రాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

రైతు బజార్లు, మార్కెట్ యార్డులకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ హైమావతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆమె అధికారులతో సమావేశమయ్యారు. మార్కెట్ల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పశుసంవర్ధక శాఖ అధికారులతోనూ సమావేశం నిర్వహించారు. పశువుల సంరక్షణకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఆ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పశువులకు వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు వ్యాక్సినేషన్ చేయాలని కోళ్లు చనిపోయినప్పుడు వాటిని సరిగ్గా డిస్పోజ్ చేయించేందుకు పొల్యూషన్ బోర్డు, పశుసంవర్ధక శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రతి పౌల్ట్రీఫాంకు ప్రహరీ ఉండాలన్నారు. ఆసుపత్రి భవనాల్లో డీఆర్‌డీఏ ద్వారా టాయిలెట్‌లు ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి పూర్ణచందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, ఎంపీడీవో రాంప్రసాద్, ఎమ్మార్వో సుజాత, గోవిందరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.



తొగుట మండలం లింగాపూర్‌లో పోలీసుల పహారాలో రైతులకు యూరియా టోకెన్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు



సిద్దిపేట రూరల్ : సిద్దిపేట-ముస్తాబాద్ రోడ్డుపై రాఘావాపూర్ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

యూరియా కోసం యుద్ధం..

● ఒక రైతుకు ఒక బస్తానే..!

- పోలీసు బందోబస్తు మధ్య పంపిణీ
- పలుచోట్ల వివరాలు నమోదు చేసుకున్నాకే టోకెన్లు జారీ
- గంటల తరబడి క్యూలో నిరీక్షణ
- కొనసాగిన రాస్తారోకోలు... ఆందోళనలు

యూరియా కొరత ఇప్పుడు జిల్లా రైతులను తీవ్రంగా వేధిస్తోంది. పొలానికి ఎంతో కీలకమైన యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలో నిలబడుతున్నారు. కొందరు రాస్తారోకోలు కూడా చేస్తున్నారు. కొన్ని చోట్ల ఉద్రిక్తతలకు దారి తీయడంతో, పోలీసులు పహారాలో ఎరువులు పంపిణీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. యూరియా కోసం నిత్యం పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

- తొగుట/ సిద్దిపేట రూరల్/ సిద్దిపేట అర్బన్/ కుకునూరుపల్లి, ఆగస్టు 20

తొగుట మండలం లింగాపూర్ గ్రామంలో 413 యూరియా బస్తాలను గురువారం పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. యూరియా వచ్చిన విషయం తెలుసుకున్న ఎల్. బంజర్‌పల్లి, జప్తిలింగారెడ్డిపల్లి, వెంకట్రావుపేట, లింగాపూర్ గ్రామాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో చేరకున్నారు. ఈ క్రమంలో తోపులాటలు జరిగాయి. పరిస్థితి చేయిదాటిపోతుందని భావించిన తొగుట తహసీల్దార్ శ్రీకాంత్, ఏవో మోహన్ పోలీసులకు సమాచారం అందించారు. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ఒక్కో రైతుకు ఒక బస్తా మాత్రమే ఇచ్చారు. దీంతో మిగతా రైతులు ఆగ్రహం వ్యక్తం చేసి ఆందోళన చేపట్టారు. పంట ఎదుగుదల దశలో ఉన్నప్పుడు యూరియా అందుబాటులో లేకపోవడంతో పంటలు ఎలా కాపాడుకోవాలని



సిద్దిపేట అర్బన్ మండలం మిట్లపల్లిలో యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

మిగతా 8వ పేజీలో



హుస్నాబాద్‌లో ఘనంగా తీజ్ వేడుకలు

● గిరిజనులతో కలిసి నృత్యం చేసిన మంత్రి పొన్నం

హుస్నాబాద్, ఆగస్టు 211 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌లోని సిద్దేశ్వరగుట్ట బంజారా భవన్‌లో గురువారం తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ఆటపాటలతో వేడుకలను నిర్వహించిన గిరిజన మహిళలు తీజ్‌ను నిమజ్జనం చేశారు. ఈ వేడుకలకు మంత్రి ప్రభాకర్ హాజరై సేవాలాల్ మహారాజ్, మేరీమా యాడిలకు పూజలు చేశారు.

మిగతా 8వ పేజీలో

'గౌరవెల్లి' భూ సేకరణను వేగవంతం చేయాలి

● అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
● రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్

హుస్నాబాద్, ఆగస్టు 211 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ ప్రాంతానికి సాధ్యమైనంత త్వరగా నీళ్ల అందించడానికి గౌరవెల్లి ప్రాజెక్టు భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి ఆయన హుస్నాబాద్ మున్సిపల్ సమావేశ మందిరంలో నియోజకవర్గ, పట్టణ అభివృద్ధిపై వేర్వేరుగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ పనులు, సంక్షేమ పథకాల అమలును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లను వేగం గా నిర్మించాలన్నారు. ఇసుక విషయంలో లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేటలో కొత్త నర్సరీలు ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లలగడ్డలో అర్బన్ డెవలప్‌మెంట్ పార్క్‌కు సంబంధించిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మహాసముద్రం గండి వద్ద ఏకో టూరిజం, ట్రెకింగ్, పాపన్న పోర్ట్‌పై అధికారులతో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి వార్డుకు 500 మొక్కలు నాటాలని, వినాయక చవితి సందర్భంగా ప్రముఖులకు మట్టి వినాయకుడు, మారేడు మొక్క, బట్ట సంచిని పంపిణీ చేస్తామని వెల్లడించారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చెర్మన్ కంది తిరుపతిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ పలువురు పాల్గొన్నారు.



● అమ్మకు బోనం

శ్రావణమాసం చివరి గురువారం పురస్కరించుకుని చేర్యాలలో పెద్దమ్మతల్లి బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు భక్తిప్రపత్తులతో బోనం తయారు చేసి డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు.

- చేర్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి)

సమస్యలు పరిష్కరించేందుకు హాస్టల్స్ సందర్శిస్తా..

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన వసతి గృహాల సలహా సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ పాఠశాలలు, అనుబంధ హాస్టల్స్ కళాశాలల హాస్టల్స్‌లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్లలో ఉండే ప్రతీ విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలన్నారు. అందుకు అనుగుణంగా నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. రోజువారీ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని తెలిపారు. సమస్యల పరిష్కారానికి తాను స్వయంగా హాస్టళ్లను సందర్శించి, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తానని వెల్లడించారు. కొన్ని హాస్టళ్లకు అద్దెలు చెల్లించకపోవడంతో యజమానులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సీఎం గ్రీన్ ఛానెల్ ఏమైంది?

సీఎం గ్రీన్ ఛానెల్ గురించి అసెంబ్లీలో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాటలు ఉట్టివేనా అని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. చెప్పడం గొప్పగా ఉంటుందని, చేయడం శూన్యమని విమర్శించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇప్పటికీ విద్యార్థులకు యూనిఫాంలు అందలేదన్నారు. ఆరు నెలలుగా మెస్, కాస్మెటిక్ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. హాస్టల్ విద్యార్థుల ఇబ్బందులు ముఖ్యమంత్రికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో మండల విద్యాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దారులు, సంక్షేమ శాఖల అధికారులు, వార్డెన్‌లు తదితరులు పాల్గొన్నారు.



గుంతలమయంగా మారిన తొగుట నుంచి సిద్దిపేట వెళ్లే రహదారి

అడుగడుకో గుంత

● ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా రోడ్లు ● వాహనదారులకు అవస్థలు
● మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి

7

సంపూర్ణ అక్షరాస్యత సాధన కోసం ‘ఉల్లాస్’

వయోజన విద్య ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి

కల్హేర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ అక్షరాస్యత సాధించడం కోసం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్‌రెడ్డి కోరారు. కల్హేర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఉపాధ్యాయులు, ఐకేపీ, వీవోఏల సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని మండలాల్లో ఉల్లాస్ కార్యక్రమంలో బాగంగా నిరక్షరాస్యుల వివరాలు పొందుపర్చడం జరిగిందని, ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల మహిళలను భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రతి కుటుంబం వంద శాతం అక్షరాస్యత కలిగి ఉండటమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమన్నారు.

వినియోగదారుడా మేలుకో



వస్తువుల నాణ్యత.. సేవల్లో లోపంపై చింత వద్దు

వినియోగదారుల రక్షణ చట్టంతో చర్యలు.. అవగాహనతో మోసాలకు చెక్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల రక్షణ చట్టం గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది మోసపోతున్నారు. మూడు దశాబ్దాలుగా అమల్లో ఉన్న వినియోగదారుల రక్షణ చట్టం 1986ను రద్దు చేసి, దాని నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం 2019లో కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా దుకాణాల్లో నాణ్యత లేని వస్తువులను విక్రయించినా, అసాధారణ ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టించినా కేసులు నమోదు చేయడానికి అవకాశం ఉంది. తూనికలు, కొలతల్లో మోసాలు, ముద్రిత ధర కంటే ఎక్కువ వసూలు చేయడం, నకిలీ వస్తువుల విక్రయాలు పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. నకిలీ విత్తనాలు, ఎరువులు కొని రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు.

ఎలా నష్టపోతున్నారంటే..

వస్తువుల నాణ్యతలో లోపాలు, ప్యాకేజీపై ముద్రించిన ధర కంటే ఎక్కువ వసూలు చేయడం, పరిమాణం తక్కువగా ఉండటం, వ్యాపారులు అవలంబించే నిర్బంధ పద్ధతుల వల్ల వినియోగదారులు నష్టపోతున్నారు. ఇలాంటి సందర్భాలతో పాటు మెడికల్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, విద్యుత్, రియల్ ఎస్టేట్, పోస్టల్, చిట్‌ఫండ్, రవాణా, కొరియర్ సర్వీస్, విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో సరైన సేవలు అందకపోయినా ఈ చట్టం ద్వారా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

రశీదుల విషయంలో జాగ్రత్త అవసరం

వినియోగదారుల రక్షణ చట్టంపై సరైన ప్రచారం లేకపోవడంతో వ్యాపారులు చాలామందిని మోసం చేస్తున్నారు. ఏ వస్తువు విక్రయించినా ఒరిజినల్ రశీదు ఇవ్వాలి. కానీ చాలామంది డూప్లికేట్ రశీదులు ఇస్తున్నారు. వస్తువులో నాణ్యత లోపిస్తే, డూప్లికేట్ రశీదుల కారణంగా పరిహారం పొందలేకపోతున్నారు. అందుకే, ఏ వస్తువు కొనుగోలు చేసినా దాని యాజమాన్యం నుంచి తప్పకుండా ఒరిజినల్ రశీదు తీసుకోవాలి. అలాగే తక్కువ ధరకు లభిస్తుందనే ఉద్దేశంతో కొందరు రశీదు లేకుండానే కొనుగోలు చేస్తున్నారు. దీంతో వస్తువులో లోపం ఉన్నప్పుడు, రశీదు లేని కారణంగా సరైన న్యాయం లేదా నష్టపరిహారం పొందలేకపోతున్నారు.



కమిషన్‌లో నమోదైన కేసుల వివరాలు

సంవత్సరం	నమోదైనవి	పరిష్కారమైనవి	పెండింగ్‌లో
2022	86	86	0
2023	102	98	4
2024	137	96	41
2025	112	14	98

సత్వర పరిహారం కోసం కృషి



సమాజంలో వినియోగదారుడు అడుగడుగునా మోసపోతున్నాడు. వారికి జరిగిన నష్టానికి పరిహారం అందించేందుకు మా కమిషన్ కృషి చేస్తుంది. వినియోగదారులు ఎలాంటి ఖర్చు లేకుండా కమిషన్ కార్యాలయాన్ని సంప్రదించి పరిహారం పొందవచ్చు. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ విద్యుత్, విద్యా సంస్థలు, షాపింగ్‌మాల్, మెడికల్, పోస్టల్, చిట్‌ఫండ్, రవాణా, కొరియర్ సర్వీస్, వ్యవసాయ రంగాల్లో లోపాలు జరిగినట్లయితే మా కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. అంతేకాకుండా, టీవీలు, పత్రికల్లో అసాధారణ ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టించినా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. వినియోగదారులు పోస్టు ద్వారా కూడా తమ ఫిర్యాదును పంపవచ్చు.

- ఎస్.జయశ్రీ, చైర్మన్, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, సంగారెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా

ఫిర్యాదు చేయాలంటే..

సంగారెడ్డి పట్టణంలోని జిల్లా కోర్టు ప్రాంగణం ఆవరణలో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కార్యాలయం ఉన్నది. ఉమ్మడి జిల్లా చైర్మన్ ఇక్కడే ఉంటారు. ఈ కార్యలయంలో కేసును ఫైల్ చేయొచ్చు.

న్యాయం చేయాలని నిర్వాసితుల ఆందోళన

● గజ్వేల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

గజ్వేల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామ ప్రజలు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. తమ గ్రామానికి చెందిన అరికెల చంద్రం ఇంటిని అధికారులు బలవంతంగా ఖాళీ చేయించారని, ఆ ఇంటికి మరమ్మతుల కోసం ఖర్చు చేసిన సొమ్మును తిరిగి ఇప్పించాలని ఆందోళన చేపట్టారు. గతంలో తమ కోసం ధర్నాలు, నిరసనలు చేపట్టిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ న్యాయం జరగలేదని గ్రామ మాజీ సర్పంచ్ దామరంచ ప్రతాప్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం 95 శాతం పరిహారం, ప్యాకేజీ, ఇళ్లు మంజూరు చేసిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వం చేయాల్సిన మిగిలిన 5 శాతం పనులను కూడా పూర్తి చేయలేకపోతోందని మండిపడ్డారు. అధికారులు ఒక్కొక్కరికీ ఒక్కో న్యాయం చేస్తున్నారని, అరికెల చంద్రంకు ఎలాంటి ఆధారాలు లేవని ఖాళీ చేయించారని, కానీ అదే గ్రామానికి చెందిన రాధాకిషన్‌కు రిజిస్ట్రేషన్ చేసిన స్థలంలో ఇళ్లు కట్టుకుంటుంటే అడ్డుకున్నారని ఆయన ప్రశ్నించారు. పోలీసులు జోక్యం చేసుకుని రెండు రోజుల్లో న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

అదృశ్యం కేసు నమోదు

అధికారుల వేధింపుల కారణంగానే తన కుమారుడు అరికెల చంద్రం (38) అదృశ్యమయ్యాడని అతని తండ్రి బాలయ్య గజ్వేల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మల్లన్నసాగర్ నిర్వాసితుడిగా తమకు తాత్కాలికంగా కేటాయించిన ఇంటి నంబర్ 162కు చంద్రం దాదాపు రూ.11.50 లక్షలు ఖర్చు చేసి మరమ్మతులు చేయించాడని బాలయ్య తెలిపారు. ఈ ఖర్చును ఇప్పించాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని, పైగా ఆ ఇంటిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేసి బలవంతంగా ఖాళీ చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏటిగడ్డకిష్టాపూర్ గ్రామస్థులు

ఆర్ఐ ఫిర్యాదుతో చంద్రంపై కేసు నమోదు

అధికారులను బెదిరించినట్లు గజ్వేల్ ఆర్ఐ కృష్ణ ఫిర్యాదు మేరకు అరికెల చంద్రంపై కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ తెలిపారు. ఏటిగడ్డ కిష్టాపూర్‌లోని ఇంటి నంబర్ 162కు మధుసూదన్‌రెడ్డికి ప్రభుత్వపరంగా రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ, అరికెల చంద్రం అక్రమంగా ఆ ఇంట్లో నివాసం ఉంటున్నారని ఆర్ఐ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటిని ఖాళీ చేయమని కోరితే, కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటామని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

తహసీల్దార్ గదిలో డీజిల్ పోసుకుని.. యువకుడి ఆత్మహత్యాయత్నం

చిన్నకోడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ఓ యువకుడు ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అప్రమత్తమైన సిబ్బంది అతడిని అడ్డుకున్నారు. బాధితుడు ముష్కిరి రాజు కథనం ప్రకారం, గోనెపల్లిలో తమ కుటుంబానికి వంశపారంపర్యంగా సంక్రమించిన భూమిని 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. 2004-05లో రెవెన్యూ అధికారుల తప్పిదంతో భూమి దాయాదుల పేరిట నమోదైంది. అప్పటినుంచి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాడు. సిద్దిపేట జూనియర్ సివిల్ కోర్టులో కేసు నడుస్తోంది. అయితే, ఇటీవల దాయాదులు ఆ భూమిని వారి కుమారులకు రిజిస్ట్రేషన్ చేసేందుకు స్లాట్ బుక్ చేసుకున్నారు. ఆ స్లాట్‌ను నిలిపివేయాలని కోరుతూ రాజు ఈ నెల 14న తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించాడు. గురువారం రిజిస్ట్రేషన్ జరుగుతోందని తెలిసి కార్యాలయానికి వచ్చి తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగాడు. తర్వాత వెంట తెచ్చుకున్న డీజిల్ బాటిల్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా, సిబ్బంది అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సైఫ్ అలీ వచ్చి అతడిని సముదాయించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

పుల్‌కల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పుల్‌కల్ ఎస్ విశ్వజన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19న మిన్‌పూర్ గ్రామానికి చెందిన మంగలి నర్సింలు(34) సింగూరు నుంచి సంగారెడ్డి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కాడు. స్వగ్రామానికి వెళ్లే క్రమంలో డ్రైవర్, కండక్టర్‌కు సమాచారం ఇవ్వకుండానే అకస్మాత్తుగా బస్సు దిగుతూ కిందపడ్డాడు. ఈ ఘటనలో నర్సింలు కాళ్లకు, పొత్తికడుపునకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా, గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి దత్తమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్ట్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాత్రివేళ దుకాణాల షట్టర్లు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను సిద్దిపేట పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 12న సిద్దిపేట పట్టణ పరిధిలో రెండు చోట్ల మెడికల్‌షాప్‌ల్లో దొంగతనం జరిగింది. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా టూటౌన్ పోలీసులు హైదరాబాద్‌కు చెందిన ఇందుకూరి సూర్య, మహమ్మద్ ఆరీఫ్, తొగుట మండలం గుడికందులకు చెందిన బాణాపురం సుభాష్, పటాన్‌చెరుకు చెందిన సాజిద్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఒక సెల్‌ఫోన్, ఒక ఆటోను స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించారు.

ఇరిగిపల్లిలో బోరుమోటారు వైర్ల చోరీ

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఇరిగిపల్లి గ్రామంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. గత మూడు రోజులుగా రైతుల పంట పొలాల్లోని బోరుమోటారు వైర్లను దొంగిలిస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల్లో 20 మోటార్ బోర్లు, సోలార్లకు చెందిన వైర్లు చోరీకి గురైనట్లు సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మూర్ఛతో పొలంలో పడి వ్యక్తి మృతి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలోని ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో మూర్ఛ వ్యాధితో వరి పొలంలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడిని సిద్దిపేట పట్టణం, శ్రీనగర్ కాలనీకి చెందిన తంగళ్లపల్లి నర్సింహచారి (50)గా గుర్తించారు. ఆయన వృత్తిరీత్యా స్వర్ణకారుడు. నర్సింహచారి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో 19న కుటుంబసభ్యులు సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం నర్సింహచారి మృతదేహం వరి పొలంలో లభ్యమైంది.


బురదమయంగా ఝరాసంగం మండలంలోని పూర్యానాయక్ తండా రోడ్డు


గుంతలమయంగా కంది మండలం బ్యాతోల్‌కు వెళ్లే రోడ్డు


పటాన్‌చెరు నుంచి ఇంద్రేశం వెళ్లే రోడ్డు


నర్సాపూర్‌లోని హన్మంతాపూర్ రోడ్డు


నారాయణఖేడ్ పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద గతుకులమయంగా మారిన రోడ్డు


నారాయణఖేడ్ శివార్లలోని మనూరు రోడ్డు


చేర్యాలలో మట్టి,మొరంతో బైపాస్‌రోడ్డు

అడుగడుకో గుంత

అధ్వానంగా ఉమ్మడి జిల్లా రోడ్లు
వాహనదారులకు తప్పని అవస్థలు
మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి

అల్లాదుర్గం/కంది/నారాయణఖేడ్/ఝరాసంగం/నర్సాపూర్/పటాన్‌చెరు/చేర్యాల/కొమురవెల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని రోడ్లు అతలాకుతలమయ్యాయి. సాధారణ గతుకులే కాదు, అడుగుకో గుంతతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. వాహనదారుల ప్రాణాలకు ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయి. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలిచి, వాటి లోతు తెలియక వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుంతల కారణంగా వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఈ పరిస్థితిపై అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని విన్నవిస్తున్నారు.

వివిధ ప్రాంతాలలో దుర్భర పరిస్థితి

● కంది మండలంలోని బ్యాతోల్, ఎర్దనూర్, వడ్డేనగూడ తండా, కొయ్యగుండు తండాతో పాటు ఇస్మాయిల్‌ఖాన్‌పేట్ బైపాస్ రోడ్డు, ఎర్దనూర్, ఉత్తర్‌పల్లి రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కలివేముల నుంచి మక్తఅల్లూర్ వెళ్లే రోడ్డు బురదమయంగా మారి ప్రయాణం కష్టంగా మారింది. కంది మండల కేంద్రంలోని సాయి, విజ్ఞాన్, శ్రీనిధి కాలనీల్లో రోడ్లు చినుకుపడితే బురదగా మారుతున్నాయి.

● నారాయణఖేడ్ పట్టణంలోని శివాజీచౌక్, వెంకటరెడ్డి చౌక్, చాంద్‌ఖాన్‌పల్లి చౌరస్తా, మంగల్‌పేట బైపాస్ క్రాస్‌రోడ్డు వద్ద రోడ్లపై ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయి. నారాయణఖేడ్ - జగన్నాథ్‌పూర్, పిప్రి - మనూరుల మధ్య జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నా, గుంతలు ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

● ఝరాసంగం మండలంలోని పుర్యానాయక్‌తండా, ఏడాకులపల్లి రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి.




కోతకు గురైన అల్లాదుర్గం ప్రధాన రోడ్డు, రహదారిపై గుంతలు, పారుతున్న వరదనీటితో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఏడాకులపల్లి నుంచి కోహీర్ చౌరస్తా వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర రోడ్డు గతుకులమయంగా మారింది. ఈ రోడ్డు గుండా జీర్లపల్లి, చీలమామిడి, బోరెగావ్, ఇస్లాంపూర్ గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. గుంతల్లో వర్షపు నీరు నిలిచి, వాటిని గుర్తించడం కష్టంగా మారింది. కక్కర్‌వాడ నుంచి పూర్యానాయక్‌తండా వరకు రోడ్డు నిర్మాణం కోసం ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా రూ.2.38 కోట్లు మంజూరైనా, కాంట్రాక్టర్ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో వర్షాలకు రోడ్డంతా దెబ్బతింది.

● పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ రహదారి గుంతలమయంగా మారింది. ఇంద్రేశం నుంచి ఆరు కిలోమీటర్ల మేర మోకాల్లోతు గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● అల్లాదుర్గం మండలంలో వర్షాలకు చెరువులకు గండ్లు పడటంతో అల్లాదుర్గం రహదారిపై బట్టికుంట చెరువు గండితో నీరు ప్రవహిస్తోంది. రోడ్డుపై నీరు నిలవడంతో ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. రహదారి ఇరువైపులా పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ముస్లాపూర్ గ్రామ సమీపంలోని ముస్లాపూర్-బహిరన్‌దిబ్బ ప్రధాన రహదారి వరదనీటికి కోతకు గురైంది.

● నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని హన్మంతాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. అలాగే, నర్సాపూర్ నుంచి కొండాపూర్, కాగజ్‌మద్దూర్ మీదుగా పటాన్‌చెరుకు వెళ్లే రోడ్డు ఏళ్ల నుంచి గుంతలతో నిండి ఉంది. ఆర్టీసీ బస్సులను ఈ రోడ్డుపై నడపలేక ఆపేశారు.

● చేర్యాల: చేర్యాల పట్టణ శివారులోని బాలాజీ కళామందిర్ చౌరస్తా నుంచి పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్ వరకు గల బైపాస్‌రోడ్డు పూర్తిగా మట్టితో అధ్వానంగా మారింది. ఈ దారిలో గుంటూరుపల్లితో పాటు ఆకునూరు, ధూళిమిట్ట, నంగునూరు, మద్దూరు, హుస్నాబాద్, జనగామ, నర్మెట్ట మండలాలకు ప్రయాణిస్తుంటారు. ఇదే రోడ్డుపై మున్సిపల్, ఎస్టీవో, టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఏడీఈ కార్యాలయం, కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం నిధులు మంజూరైనా పనులు జరగలేదు. ఇటీవల మున్సిపల్ అధికారులు గుంతల్లో మట్టి మొరం పోయించినా, వర్షాలకు బురదగా మారుతోంది. శాశ్వత ప్రాతిపదికన రోడ్డు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

● కొమురవెల్లి: కొమురవెల్లి నుంచి కొండపోచమ్మ, హైదరాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలను వాహనదారులు గుర్తించేలా స్థానికులు ఎర్రజెండాను ఏర్పాటు చేశారు.



హల్దీ వాగు ఉధృతికి కొట్టుకుపోయిన కాజ్‌వే

తూప్రాన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలంలో హల్దీ వాగుపై నిర్మించిన కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోయింది. మూడు రోజుల నుంచి వాగు ఉధృతంగా ప్రవహించగా, కాజ్‌వే కింద వేసిన మట్టి కొట్టుకుపోయి సీసీ ముక్కలై రోడ్డు తెగిపోయింది. దీంతో తూప్రాన్ పట్టణం నుంచి గౌడిగూడెం, గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్, కోనాయపల్లి, సిద్దిపేట జిల్లాలోని మాచినపల్లి, ఇందుప్రియాల్‌తో సహా పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

గణనాథుడి ఆగమనం



వినాయక విగ్రహాలు మండపాలకు చేరుకుంటున్నాయి. ఈ నెల 27వ తేదీన వినాయక చవితి సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రానికి గణనాథుల రాక మొదలైంది. సంగారెడ్డిలోని నేతాజీ నగర్‌లోని హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న భారీ గణనాథుడిని గురువారం రాత్రి పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి ప్రత్యేక కళాకారుల డప్పుచప్పుళ్లు, బ్యాండ్‌బాజా, నృత్యాలతో విద్యుత్ కాంతుల మధ్య మండపం వరకు నిర్వహకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు.

-సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి)


భవానీ దీక్షాధారులతో సంగ్రాం మహరాజ్

ప్రతీ మానవుడు భక్తి మార్గం వైపు పయనించాలి : సంగ్రాం మహరాజ్

కల్హేర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ మానవుడు భక్తి మార్గం వైపు పయనిస్తే జీవితం ధన్యమవుతుందని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి, ఆలిండియా సాధు సంతుల సంఘం తెలంగాణా ప్రతినిధి సంగ్రాం మహరాజ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బల్కం చెల్కాతండాలో గురువారం 40 మంది గిరిజనులకు ఆయన భవానీ మాతా దీక్షధారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన అనుగ్రహభాషణం చేస్తూ తండాల్లో భవానీ మాతా దీక్షలు చేపట్టడం ఎంతో సంతోషకరమని, ఈ దీక్షలతో వారి జీవితాల్లో ఎంతో మార్పు వస్తుందని అన్నారు.

వృద్ధులను గౌరవించడం మన బాధ్యత

● సంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వృద్ధులను గౌరవించడం మన బాధ్యతగా భావించి వారి బాగోగులు చూసుకోవాలని సంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం సంగారెడ్డిలోని ది గ్రేస్ వృద్ధాశ్రమాన్ని తనిఖీ చేసి, వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025 సీనియర్ సిటిజన్ దినోత్సవం లక్ష్యం.. వృద్ధుల స్వరాలను శక్తివంతం చేయడం, వారి అనుభవాలు, జ్ఞానాన్ని గుర్తించి విస్తరింపజేయడమేనని ఆమె తెలిపారు. వృద్ధాశ్రమంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, న్యాయపరమైన అంశాల్లో ఉచిత సహాయం అవసరమైనవారు సంగారెడ్డిలోని తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు. ఈ తనిఖీల్లో వృద్ధాశ్రమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలోచనల నుంచి వాస్తవికత వైపు గీతం విద్యార్థులు

ఆచరణాత్మక అనుభవం పొందిన ఆర్కిటెక్చర్ స్టూడెంట్స్

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): డిజైన్ ఆలోచనలు, భావనలు నిర్మాణ వాస్తవికతగా ఎలా రూపాంతరం చెందుతాయో గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ మూడో సెమిస్టర్ విద్యార్థులు ఇటీవల సికింద్రాబాద్‌లోని ఒక ప్రముఖ ఆర్కిటెక్ట్ నివాసాన్ని సందర్శించి, కేస్ స్టడీలా అధ్యయనం చేశారు. వాతావరణానికి అనుగుణంగా రూపొందించిన నిర్మాణం, సమర్థవంతమైన ప్రదేశాల ప్రణాళిక, నిర్మాణ సామగ్రి వినియోగం, నిర్మాణంలోని సూక్ష్మ నైపుణ్యాలను విద్యార్థులు నిశితంగా పరిశీలించారు. ఆర్కిటెక్ట్‌తో నేరుగా మాట్లాడటం వల్ల డిజైన్ భావనలు నిర్మాణంగా ఎలా మారతాయో వారు స్వయంగా తెలుసుకున్నారు. తమ పరిశీలనలను స్కెచ్ పుస్తకాల్లో నమోదు చేసుకుని, తరగతి గదిలో నేర్చుకున్న సిద్ధాంత జ్ఞానాన్ని క్షేత్రస్థాయి విశ్లేషణతో పోల్చి చూశారు. ఈ అనుభవం విద్యార్థుల సాంకేతిక అవగాహనను పెంచడమే కాకుండా, వాస్తుశిల్పంలోని సృజనాత్మక కోణాలను కూడా అర్థం చేసుకునేలా ప్రేరేపించింది.

చౌటకూర్‌కు సిబ్బంది కేటాయింపు

● తహసీల్ కార్యాలయానికి 13 మంది
● ఐదేళ్లుగా డిప్యూటేషన్ అధికారులతో నిర్వహణ
● త్వరలో రెగ్యులర్ సిబ్బంది నియామకం


చౌటకూరు మండల తహసీల్దార్ కార్యాలయం

పుల్కల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ రెవెన్యూ మండలానికి సిబ్బందిని కేటాయిస్తూ ప్రధాన కమిషనర్, భూ పరిపాలన శాఖ (సీసీఎల్‌ఏ) ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. 2020 జూలైలో 13 రెవెన్యూ గ్రామాలను కలిపి చౌటకూర్‌ను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి తహసీల్దార్, నయాబ్ తహసీల్దార్‌తో పాటు ఇతర సిబ్బంది డిప్యూటేషన్ మీద విధులు నిర్వహిస్తున్నారు. దాదాపు ఐదేళ్లుగా ఇతర మండలాల్లో రెగ్యులర్ పోస్టుల్లో ఉన్న సిబ్బంది ఇక్కడ సేవలందిస్తున్నారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ఏర్పాటైన రెండు రెవెన్యూ డివిజన్లు, 15 రెవెన్యూ మండలాలకు కేడర్ స్ట్రెంత్‌ను కేటాయించింది. ఇందులో చౌటకూర్‌ను చేర్చుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమాచారం పంపింది. మొత్తం 13 మంది సిబ్బందిలో తహసీల్దార్, నయాబ్ తహసీల్దార్, ఇద్దరు ఎంఆర్ఐలు-2, ఒక్కొక్క సీనియర్, జూనియర్ సహాయకులు ఉంటారు. వీరితో పాటు టైపిస్టు, సర్వేయర్, ఏఎస్‌ఓ, ఆఫీస్ సబార్డినేట్, ముగ్గురు వాచ్‌మెన్-3, చైన్‌మెన్ పోస్టులను మంజూరు చేశారు. త్వరలో రెగ్యులర్ సిబ్బందిని నియమించనుండటంతో మండలంలో రెవెన్యూ పరిపాలన సజావుగా సాగనుంది. కాగా, సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉన్న నిజాంపేట మండలానికి మాత్రం సిబ్బంది కేటాయింపులు చేయలేదు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

● క్విక్ రియాక్షన్ టీంలతో పటిష్ట బందోబస్తు
● ప్రతీ కేసులో నాణ్యమైన దర్యాప్తు చేయాలి : ఎస్పీ పంకజ్


న్యాయవాదులకు సన్మానిస్తున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. వినాయక చవితి, మిలాద్ ఉన్‌నబీ పండుగలు ఒకేసారి వస్తున్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల కేంద్రాల్లో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. క్విక్ రియాక్షన్ టీంలను ఏర్పాటు చేసి త్వరితగతిన స్పందించాలని ఆదేశించారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా మండపాల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని, లౌడ్‌స్పీకర్లు పరిమిత స్థాయిలో వాడేలా చూడాలన్నారు. గంజాయి స్మగ్లర్లపై నిఘా ఉంచాలని, విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అన్ని మతాలకు చెందిన పవిత్ర స్థలాలు, పరిశ్రమల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించుకోవాలన్నారు. విచారణ కేసుల్లో వేగం పెంచాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జరిపించాలని సూచించారు. పోక్సో అత్యాచార కేసులలో వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలని, అందుకు భరోసా సెంటర్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. సిబ్బంది సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో ఓపికగా మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

న్యాయవాదులకు సన్మానం

వివిధ కేసులలో నిందితులకు జీవిత ఖైదు పడేలా వాదనలు వినిపించిన పీపీ శైలజ, విజయ్ శంకర్‌రెడ్డి, సత్యనారాయణ, రాజేశ్వర్, నూర్‌రెడ్డిను ఎస్పీ పంకజ్ సత్కరించారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీలు సత్యగౌడ్, ప్రభాకర్, సైదానాయక్, వెంకటరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరభారతీయులతో తెలంగాణకు ప్రమాదం

● పాలకుల, అధికారుల నిర్లక్ష్యంతో మన ఉనికికే ప్రమాదం : జాగో తెలంగాణ

జహీరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరభారతీయుల ప్రభావంతో స్థానికులు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని జాగో తెలంగాణ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, తెలంగాణలో ఉత్తరభారతీయులు చేసే వ్యాపారాలు కల్తీమయంగా ఉన్నాయని, నకిలీ వస్తువులను విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వారి తినుబండారాల్లో కల్తీ ఎక్కువగా ఉండటంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడి ఆసుపత్రుల పాలై ఆర్థికంగా, మానసికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో, వ్యాపార రంగాల్లో వారి ఆధిపత్యం పెరిగి స్థానికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. నకిలీ, నాసిరకం వస్తువులను విక్రయిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ నిర్లక్ష్యం వల్ల భవిష్యత్తులో తెలంగాణ వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో స్థానిక వనరులను వినియోగిస్తున్నప్పుడు స్థానిక వాటా కింద ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు అన్ని రంగాల్లో మోసానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఇకనైనా మేల్కోకపోతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. మార్వాడీ గో బ్యాక్ అంటూ జహీరాబాద్‌లో నిర్వహించే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాగో తెలంగాణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాగో తెలంగాణ నాయకులు రాములు నేత, మాదీనం శివప్రసాద్, దశరథ్, ఇమ్రాన్, కిరాణా వర్తక సంఘం నాయకులు సంతోష్, అశోక్ బాబా, రమేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాగో తెలంగాణ నాయకులు

సంపూర్ణ అక్షరాస్యత కోసం ఉల్లాస్

● ఎంఈవో బండారి మనీల

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు విద్యా సహాయం అందించడమే ఉల్లాస్ లక్ష్యమని మండల విద్యాధికారి బండారి మనీల పేర్కొన్నారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలోని మోడల్ పాఠశాలలో నవభారత్ సాక్షరత, ఉల్లాస్‌పై మండలంలోని గ్రామైక్య సంఘాల వివోఏలు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించడం కోసం ఉల్లాస్ అనే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి, వారిని అంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వలంటీర్లను నియమించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 8న రాష్ట్ర వ్యాప్తంగా ఉల్లాస్ కార్యాక్రమాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్‌లు దేవసాని సంపత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి ఉల్లాస్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సంధ్య, వేణుకుమార్, మహేందర్‌రెడ్డి, మెడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్, సీఆర్పిలు, స్వామి, జ్యోత్స్న,స్వప్న పాల్గొన్నారు.

ఏఈని విధుల నుంచి తొలగించాలి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మేస్త్రీలను ఇంటికి 5000 రూపాయల చొప్పున లంచం అడిగిన రూరల్ హౌసింగ్ ఏఈ వెంకన్నను విధుల నుంచి తొలగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రెహమాన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గోపాలస్వామి మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద వెంకటాపూర్ గ్రామాన్ని ప్రభుత్వం ఎంపిక చేసిందని ఈ తరుణంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్న మేసీ నుంచి హౌసింగ్ ఏఈ పైసలు డిమాండ్ చేయడం సరికాదని అన్నారు. ఒకవేళ డబ్బులు ఇవ్వకపోతే బిల్లులు రాకుండా అడ్డుకుంటానని సదరు అధికారి బెదిరించడం పట్ల పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

●పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పన్యాల శ్రీనివాస్‌రెడ్డి



పోస్టర్ అవిష్కరిస్తున్న పీఆర్‌టీ యూ నాయకులు

సిద్దిపేట రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం ఆమలు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పన్యాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీపీఎస్ అంతం-పీఆర్‌టీయూ పంతం అనే నినాదంతో సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలుత కోసం సెప్టెంబర్ 1న ఇందిరాపార్క్ వద్ద జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రోడ్డు కబ్జా చేసి.. అడ్డంగా ఫంక్షన్ హాల్

కోహెడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కబ్జాలకు కాదేది అనర్హం అన్నట్లుగా.. కోహెడ మండలంలో ఏకంగా రోడ్డునే కబ్జా చేసేశారు. 50 సంవత్సరాలకు పైగా వ్యవసాయ బావుల వద్ద రహదారిని కబ్జా చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన శైలేఖ రాజు అనే వ్యాపారి ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపడుతున్నాడని తాహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్‌కు గురువారం ఇచ్చిన వినతిలో రైతులు వివరించారు. గతంలో వందల ఎకరాలకు పైగా అసైన్డ్ భూములు కొనుగోలు చేస్తున్నారని అధికారులకు వివరించినా ఫలితం లేదన్నారు. అక్రమణలను అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం వారికి కొమ్ము కాస్తుండటంపై స్థానికులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తన పట్టా భూమి నుంచి దోవ (రహదారి) ఇస్తామని చెప్పి ఈ రహదారిని కబ్జా చేసినట్లు రైతులు ఆరోపించారు. అలాగే ఇరిగేషన్ శాఖకు చెందిన చెరువులకు వెళ్లే కట్టు కాలువ కూడా కబ్జా చేశారని ఆరోపించారు . సమగ్ర సర్వే చేసి రైతులకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఉన్నతాధికారులు సకాలంలో స్పందించి ప్రజల రాకపోకలకు అడ్డంగా రహదారిలో గోడను ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, రైతులు కోరుతున్నారు.

పెన్షన్ భిక్ష కాదు ఉద్యోగి హక్కు

మర్కుక్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ ఛలో ఇందిరాపార్కు ఛలో హైదరాబాద్ పీఆర్‌టీయూ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యద ర్శి కుమార్ అన్నారు. గురువారం మర్కుక్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం చట్టాలు



చేర్యాల కోర్టు ఆవరణలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రేవతి

చేర్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డే పురస్కరించుకుని జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం చేర్యాల పట్టణంలోని కోర్టుఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి రేవతి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం పలు చట్టాలున్నాయని, తమ కుటుంబసభ్యుల నిరాదరణకు గురయ్యే వారికి తగిన న్యాయం చేకూర్చుతామన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్ లాయర్ యాదగిరిని శాలువా కప్పి సత్కరించారు.

మూన్నాళ్ల ముచ్చటగా రైతు వేదిక

● కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వానికి అద్దం పడుతున్న వేదిక ● నిర్వాహణ లేక వెలవెల .. శిథిలావస్థకు చేరిన దుస్థితి

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతి, సంక్షేమ కార్యక్రమాలు, పంటల సాగుపై స్థానికంగా రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన రైతు వేదికలు వినియోగం లేక నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతున్నాయి. రైతు వేదికల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడంతో హడావుడిగా నిర్మించిన రైతు వేదికలు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా నిర్ణయించి లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలు రైతులకు ఉపయోగపడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామ రైతు వేదిక అందుకు అద్దం పడుతోంది... 2021లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రెండు, మూడు గ్రామాలకు అందులో 5 వేల ఎకరాల సాగు విస్తీర్ణంకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి హుస్నాబాద్ మండలంలో రైతు వేదికలు నిర్మించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఒక్కో రైతు వేదికకు సుమారు రూ. 22 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు నిధులు మంజూరు చేసింది. రైతు వేదికల నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వానికి పందిల్ల రైతు వేదిక నిదర్శనం. రైతు వేదిక నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడంతో ఆదిలోనే పందిల్ల రైతువేదిక ఫ్లోరింగ్ కుంగిపోయి భయంకరంగా మారింది. అప్పటికే గ్రామస్థులు అధికారుల దృష్టికి తెచ్చారు. అయినా పట్టించుకోకపోవడం మూలంగా ప్రస్తుతం రైతు వేదిక అక్కరకురాకుండా శిథిలావస్థకు చేరింది. దీంతో రైతు వేదికలో కార్యకలాపాలను నిలిపివేసి హుస్నాబాద్ మండల రైతు వేదికలో నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి పందిల్ల రైతు వేదిక నిర్వాహణలోకి తెచ్చేందుకు నిధులు మంజూరు చేసి రైతు వేదికను మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు.



పందిల్ల రైతు వేదిక లోపలి భాగంలో ఫ్లోరింగ్‌లో లేచిన టైల్స్, విరిగిపోయిన తలుపు

నాణ్యత పాటించడం లేదు

రైతు వేదిక నిర్మాణంలో నాణ్యత పాటించడం లేదని ముందే చెప్పాం. రైతు వేదిక నిర్మాణం చేసే టప్పుడు కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా హడావుడిగా నిర్మిస్తున్నాడని అప్పుడే అధికారుల దృష్టికి తెచ్చినా లాభం లేకుండా పోయింది. ఫ్లోరింగ్ చేసిన వెంటనే టైల్స్ వేశారని దీంతో కుంగిపోయింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి రైతు వేదికను నిర్వాహణలోకి తెచ్చేందుకు నిధులు మంజూరు చేయాలి.

\- తొడేటి రమేష్, పందిల్ల మాజీ సర్పంచ్

నేడు జిల్లాలోని అన్ని గ్రామాల్లో పనుల జాతర

● రూ.12.85 కోట్లతో 536 పనుల ప్రారంభం

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'పనుల జాతర' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛభారత్ మిషన్ ప్రధాన మంత్రి కృషి సంచాయి యోజన, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టబడిన పనులకు శంకుస్థాపనలు పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఈ పనుల జాతరలో రూ. 12.85 కోట్లతో 536 పనుల ప్రరంభం ఉందని ఆయన తెలిపారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

దౌల్తాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొల్లపల్లి నగేష్, గౌరవ అధ్యక్షుడిగా జన సంతోష్, ఉపాధ్యక్షుడిగా కావేటి బాబు లను ప్రెస్ క్లబ్ సభ్యులు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చిట్టాపూర్‌లో అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ

దుబ్బాక, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): అక్బర్ పేట భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామంలో గురువారం ఎన్ఆర్‌జీఎస్ నిధుల కింద మంజూరైన అంగనవాడీ భవన నిర్మాణానికి కూడవెళ్లి రామేశ్వరంపల్లి రామలింగేశ్వర దేవస్థానం చైర్మన్ ఉషయ్య గారి రాజిరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. చిట్టాపూర్ గ్రామానికి అంగన్‌వాడీ భవనం మంజూరు చేయడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారని, ఈభవన నిర్మాణానికి 8లక్షల రూపాయాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఈ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, తదితరులున్నారు.

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌పై విచారణ

హుస్నాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ రమేశ్‌రెడ్డితో పాటు ఇరువురి సిబ్బందిపై విచారణ చేశారు. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి సంఘం నాయకుడు గడిపె రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ వైద్య విధాన పరిషత్ అధికారి వై సూర్య శ్రీ రావు గురువారం ఆసుపత్రిలో విచారణ జరిపారు. వైద్యులు విధులకు హాజరుకావడం లేదని, సూపరిండెండెంట్ ప్రోత్సహంతో పోస్టుమార్టం చేయుటకు ఒకరి వద్ద సిబ్బంది డబ్బులు తీసుకుందని గడిపె రాములు అనే వ్యక్తి హైల్త్ సెక్రటరీకి ఫిర్యాదు చేయడంతో దీనిపై విచారణ జరిపామని సూర్య శ్రీ రావు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చెర్మన్ కేడం లింగమూర్తితో పాటు ప్రజా ప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు, ఇతర సంఘాల నాయకులు ఆసుపత్రికి వచ్చి అయన స్వార్థపూరితంగా ఫిర్యాదు చేశాడని, సూపరిండెండెంట్ రమేశ్ రెడ్డి పనితీరుతో రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయని, అసుపత్రి అభివృద్ధి చెందుతుందని ఆమెకు వివరించారు. విచారణ జరుగుతున్నప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఆసుపత్రి సూపరిండెండెంట్‌తో పాటు సిబ్బందిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని వినతిపత్రాలు సమర్పించారు. మేం ఎవరికి డబ్బులు ఇవ్వ లేదని ఫిర్యాదులో పేర్కొన్న బాధితులు రాసిచ్చారు.



విచారణ అధికారికి వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

ఆడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట రూరల్,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరీమా అగర్వాల్ తెలిపారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు ప్రభుత్వ ఐటీఐ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటీసీలో యువత చేరే విధంగా ప్రోత్సహించాలని, అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 28 చివరి అవకాశం అని చెప్పారు. ఏటీసీ కేంద్రంలో 26 రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయని, శతశాతం అడ్మిషన్లు అయ్యేలా అధికారులు కృషి చేయాలని అదేశించారు.

బయటపడిన 29 ఏళ్ల క్రితం రాజేశ్వరస్వామి ఆలయం

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో 29 ఏళ్ల క్రితం ఇంటి తవ్వకాల్లో స్వయంభూ వెలసిన రాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఈవో రామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యాక్రమాలు నిర్వహించారు. మహాన్యాసక పూర్వ శతరుద్రాభిషేకం చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సతీష్‌కుమార్, మాడిశెట్టి శ్రీధర్, నర్సింహరెడ్డి తదితరులు ఉన్నారు.

స్నేహపూర్వక సంబంధాలు పెంచుకోవాలి



రాజగోపాలపేట పోలీస్ స్టేషన్‌లో కార్డులను పరిశీలిస్తున్న సీపీ డాక్టర్ అనురాధ

నంగునూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకమైన సంబంధాలు పెంపొందించుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ అన్నారు. గురువారం నంగునూరు మండలం రాజగోపాలపేట పోలీస్ స్టేషన్‌ను ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. ప్రజల రక్షణ ధ్యేయంగా పోలీస్ సిబ్బంది పనిచేయాలన్నారు. వినాయక నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని వీపీఓలు తమకు కేటాయించిన గ్రామాలకు వెళ్లి వినాయక మండపాల పూర్తి వివరాలను తెలుసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లో వివిధ కేసులలో ఉన్న వాహనాలు అడ్రస్ ను తెలుసుకొని సంబంధిత యజమానులకు అప్పగించాలని చర్యలు తీసుకోవాలని తీసుకోవాలని ఎస్ ఐ వివేక్ ను ఆదేశించారు. బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ విధులు నిర్వహించే సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్రమ ఇసుక వ్యాపారం, జూదం, రేషన్ బియ్యం సరఫరా కాకుండా నిఘా ఎప్పటికప్పుడు ఉంచాలని తెలిపారు.

25న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25న ఉదయం 8 గంటలకు స్థానిక స్టేడియంలో అండర్ 14, 16, 18, 20 బాల బాలికలకు జిల్లా ఎంపిక పోటీలు ఉంటాయని సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామి గౌడ్ తెలిపారు. పాల్గొన్న క్రీడకారులకు ప్రశంస పత్రాలు, మొదటి మూడు స్థానాలు సాధించిన వారికి పతకాలు, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేయబడతాయన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 30, 31న మహబూబ్ నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటిల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 24 సాయంత్రం ఆరు గంటల లోపు బర్త్ సర్టిఫికెట్ జిరాక్స్‌తో జిల్లా అథ్లెటిక్స్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు.

యూరియా కోసం యుద్ధం..

(5వ పేజీ తరువాయి)

వారు ఆవేదన చెందారు. అధికారులు సర్దిచెప్పినా కూడా రైతుల ఆందోళన కొనసాగించారు.

రాస్తారోకో...

సిద్దిపేటరూరల్ మండలం రాఘవాపూర్ వద్ద రైతులు యూరియా కొరతపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం రాస్తారోకో నిర్వహించారు. యూరియా వస్తుందని ఉదయం నుంచే క్యూలో నిలబడినప్పటికీ, ఫలితం లేకపోవడంతో వారు ఆందోళనకు దిగగా బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. యూరియా వచ్చే వరకు రాస్తారోకో విరమించబోమని రైతులు భీష్మించుకుని కూర్చున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ స్వామి, ఏవో నరేష్, ఎస్ఐ రాజేష్ రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. చివరికి జిల్లా వ్యవసాయ అధికారి ఫోన్‌లో రైతులతో మాట్లాడి, సాయంత్రంలోపు యూరియా వస్తుందని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

టోకెన్ల ద్వారా..

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో రైతులు యూరియా కోసం గంటల తరబడి క్యూలో నిలబడ్డారు. ఒక బస్తా మాత్రమే ఇస్తున్నారని, అది పది ఎకరాలకు ఎలా సరిపోతుందని రైతులు ప్రశ్నించారు. ఎటువంటి గొడవలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కుకునూరుపల్లి మండలంలో యూరియా పంపిణీ కోసం అధికారులు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టారు. యూరియా కావాలంటే టోకెన్ తీసుకోవాల్సిందే. గతంలో ఎకరాకు ఒక బస్తా చొప్పున ఇచ్చేవారు, కానీ ఇప్పుడు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు వివరాలు నమోదు చేసుకుని, ఒక పాస్‌బుక్‌పై రెండు బస్తాలు ఇచ్చేలా టోకెన్లు జారీ చేస్తున్నారు. రానున్న రోజుల్లో యూరియా కొరత మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మోసపూరిత రిఫండ్ క్లైమ్ చేస్తే చర్యలు తప్పవు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మోసపూరిత రిఫండ్ క్లైమ్‌లు చేసిన వారిపై చర్యలు తప్పవని ఆదాయపు పన్ను జాయింట్ కమిషనర్ రాకేష్ అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని రైస్ మిల్లర్లు పత్తి డాక్టర్లు, వస్త్ర సిమెంటు పౌల్ట్రీ , ఇతర వర్తక సంఘాల సభ్యులతో రైస్ మిల్లర్ అసోసియేషన్ లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోసపూరిత రిఫండ్ క్లైమ్‌లకు సంబంధించి కలిగే పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయకపోవడం వల్ల కలిగే పరిణామాలను రిటర్న్ దాఖలు చేయడానికి గడువు తేదీలు టాక్స్ రేట్లు అడ్వాన్స్ టాక్స్ రేట్ లు అడ్వాన్స్ టాక్స్ తేదీలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటీవో రమణ రావు , రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

గజ్వేల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తామని శాసనమండలి సభ్యుడు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలోని శ్రీ లక్ష్మి నర్సింహస్వామి దేవాలయ ఆవరణలో ఎమ్మెల్సీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ విద్యుత్ వీధి దీపాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఆయనవెంట గ్రామ తాజా మాజీ సర్పంచ్ చెరుకు చంద్రమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సత్యానారాయణ, బాబు, కుమార్ తదితరులున్నారు.

జిల్లాలో యూరియా కొరత లేకుండా చూస్తాం

మిరుదొడ్డి/గజ్వేల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): యూరియా విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా, యూరియాను పారదర్శకంగా పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి అధికారులకు సూచించారు. గురువారం మిరుదొడ్డి పీఏసీఎస్, చెప్యాల చౌరస్తాలోని ఆగ్రోరైతు సేవాకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టాక్ రికార్డులను పరిశిలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో గత ఎడాదికంటే ఇప్పుడు 50వేల ఎకరాల్లో వరిని రైతులు సాగు చేసినట్టు తెలిపారు. ఆగస్టు చివరివరకు జిల్లాకు 39వేల మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా ప్రస్తుతం 25వేల మెట్రిక్ టన్నుల యూరియా రావడం జరిగిందని తెలిపారు. జిల్లాలో యూరియా కొరతలేకుండా చూస్తామన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి

హుస్నాబాద్‌లో ఘనంగా తీజ్ వేడుకలు

(5వ పేజీ తరువాయి)



తీజ్ బుట్టలతో గిరిజన మహిళలు

అనంతరం గిరిజన మహిళలతో కలసి నృత్యం చేశారు. సేవాలాల్ మహరాజ్, మేరీమా యాడి ఆశీర్వాదంతో పాడి పంటలతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. బంజారా భవన్ నిర్మాణానికి రూ. 45 లక్షలు ఇచ్చామని, రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పించామని తెలిపారు. ఈ భవనాన్ని పూర్తి చేసే బాధ్యత తనదని ఆయన హామీ ఇచ్చారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఈ వేడుకలకు హాజరై తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆటపాటలతో పట్టణంలోని పుర వీదుల గుండా ఎల్లమ్మ చెరువు వద్దకు ఊరేగింపుగా వెళ్లి తీజ్‌ను నిమజ్జనం చేశారు. కార్యక్రమాల్లో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ భూక్య మంగ, లక్ష్మీ, మాజీ జడ్పీటీసీ బీలునాయక్, గిరిజన సంఘాల నాయకులు పలువురు పాల్గొన్నారు.

బ్రిటీష్ కౌన్సిల్ ప్రాజెక్టులో గిరిజన ఆశ్రమ పాఠశాల పరిశోధన పత్రం

హుస్నాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బ్రిటీష్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాక్షన్ రీసెర్చ్ మెంటరింగ్ స్కీమ్ (ఎఆర్ఎంఎస్) ప్రాజెక్టులో హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న వీరాటి అమల రెడ్డి తన పరిశోధన పత్రాన్ని మూడు రోజుల క్రితం చెన్నైలో సమర్పించారు. యాక్షన్ రీసెర్చ్ మెంటరింగ్ స్కీమ్ ప్రాజెక్టులో భాగంగా దేశంలోని పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలైన ఎన్ఐటీ, ఐఐటీ డీఎం కాంచీపురం, గువాహటి యూనివర్సిటీలు ప్రభుత్వ ఉపాధ్యాయులతో కలసి పరిశోధన కార్యక్రమాలు చేపట్టాయని, తరగతి గదుల్లో ఆంగ్ల బోధనలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం కనుగొనే దిశగా ఉపాధ్యాయులు చేసిన పరిశోధన పత్రాలను ఇందులో ప్రదర్శించారని అమలరెడ్డి తెలిపారు. విద్యార్థులపై ఆంగ్ల సంభాషణ నైపుణ్య అభివృద్ధిపై ఎలా ప్రభావితం చేస్తుంది అనే అంశంపై పరిశోధన పత్రం అందించానని పేర్కొంది. తాను బోధించే ఆశ్రమ పాఠశాలలో గ్రామీణ ప్రాంతంలోని గిరిజన సమాజానికి సంబంధించిన విద్యార్థులుంటారని అన్నారు.

ఆకట్టుకున్న టీఎల్ఎం మేళా



ప్రదర్శన చూస్తున్న ఉపాధ్యాయులు

కోహెడ, /గజ్వేల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కోహెడ, గజ్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మండల స్థాయిలో టీఎల్ఎం మేళా గురువారం నిర్వహించారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు నిర్వహించిన ఈ మేళా విద్యార్థులను ఆకట్టుకుంది. మండలంలోని ప్రతి పాఠశాల నుంచి ఉపాధ్యాయులు తాము తయారు చేసిన బోధనోపకరణాలను కోహెడ ప్రభుత్వ పాఠశాలకు తీసుకువచ్చి ప్రదర్శించారు. దీనికి కోహెడ మండల విద్యాధికారి పద్మయ్య హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులందరూ పాఠ్యాంశాన్ని బోధించేటప్పుడు బోధనోపకరణాలను వాడినట్లయితే విద్యార్థులకు ఆసక్తికరంగా ఉంటుందని, తద్వారా విద్యార్థులు నేర్చుకుంటారని తెలిపారు.

మూఢనమ్మకాలు వీడాలి

చేర్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు మూఢనమ్మకాలు వీడాలని చేర్యాల ఎస్సై నవీన్ అన్నారు. చేర్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఏరియాలోని దుకాణం వద్ద ఇటీవల క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు కలకలం రేపిన నేపథ్యంలో పోలీసుల ఆధ్వర్యంలో గురువారం కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై నవీన్ మాట్లాడుతూ మూఢనమ్మకాలు విశ్వసించకూడదని, మంత్రాల నెపంతో దాడులకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదన్నారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన డీపీవో

నంగునూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నంగునూరు మండలం గట్లమల్యాలలోని ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహాన్ని గురువారం డీపీవో దేవకీదేవి తనిఖీ చేశారు. ఆమె పాఠశాలల్లోని వసతులను పరిశీలించారు. పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హాస్టల్ సమీపంలో పేరుకుపోయిన గడ్డిని వెంటనే తొలగించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.